# నాని

**ఆంధ్రభూమి, 29 మే 1999**

"ఊ హూ. నేను అత్తయ్యతో వెళ్లను. బుజ్జీ, పండువాళ్ళలాగ యిక్కడే వుంటాను. నీ దగ్గరే వుంటాను" ఎక్కెక్కి పడుతున్నాడు ఆరేళ్ళ నాని. ఏడ్చేడ్చి లేతబుగ్గలు కందిపోయాయి. వారం రోజులుంది వాడిని మేనమామకి దత్తతివ్వడానికి.

వాడి ఏడుపు చూస్తుంటే జానక్కి ఏడుపూ, కోపం రెండూ వస్తున్నాయి. "నా మాట వినరా! ఇక్కడేముందమ్మా? ఎంచక్కా మామయ్య వాళ్ళింట్లోనైతే నీకు బోల్డు బొమ్మలు కొంటారు. కొత్త చొక్కాలు, పుస్తకాలు, చాక్లెట్లు అన్నీను..." వూరిస్తూ అనునయించబోయింది జానకి.

"నాకేం వద్దు. నువ్వేకావాలి. నేను వెళ్ళను. వెళ్ళనంతే" తల్లి మెడని కౌగిలించుకుని మొహం దాచుకున్నాడు.

అప్పటిదాకా ఈ ప్రహసనమంతా చూస్తూ మౌనంగా వున్న సునంద కలగజేసుకుంది. సునందంటే నానీ మేనమామ భార్య. వాడిని తీసుకెళ్ళడానికి వచ్చింది. ఆమె వచ్చిన దగ్గర్నుంచీ నానీ ఒకటే ఏడుపు

జానకి వాళ్ళోంచి నెమ్మదిగా వాడిని తీసుకుని, ఎత్తుకుని పెరట్లోకి తీసుకెళ్ళింది. "నేను నీతో రానత్తయ్యా!" బేలగా అన్నాడు. సునంద మనసు చివుక్కుమంది. వెంటనే సర్దుకుంది. చిన్నపిల్లాడి మాటలకి పట్టింపేమిటని.

"మావూరు రావద్దులే. ఇద్దరం కలిసి బజారుకెళ్ళాం వస్తావా?" మృదువుగా అడిగింది. ఈ కన్సెషన్‌కి సంతోషంగా ఒప్పుకున్నాడు నాని. మొహం కడిగించేసుకుని చకచక తయారైపోయాడు.

"అమ్మా! అత్తయ్యతో బజారెళ్తున్నాను. మళ్లీ వచ్చేస్తాలే" హుషారుగా తల్లికి చెప్పి సునంద చిటికెనవేలు పట్టుకుని బయల్దేరాడు. అలా వెళ్తున్న వాళ్ళిద్దర్నీ చూస్తుంటే జానక్కి ఏదో కోల్పోయిన భావన కలిగింది. ఒక్కక్షణమే!

జానకి అన్న త్రిమూర్తి సెంట్రల్లో క్లాస్‌వన్ ఆఫీసర్. చాలా సంపాదించాడు. భార్యవైపు నుంచీ కూడా కొంత ఆస్తి కలిసొచ్చింది. లోన్‌మీద కట్టినదే అయినా పది లక్షలు చేసే యిల్లు, మరో రెండు ప్లాట్లు ఉన్నాయి. వాళ్ళకి పిల్లలు లేదు.

ఆర్టిఫిషియల్ యిన్‌సెమినేషన్ లాంటి ఆధునిక పద్ధతుల్ని డాక్టర్లు సజెస్ట్ చేసినా భార్యాభర్తలిద్దరికీ అవి నచ్చలేదు.

"ఓ పిల్లనో, పిల్లాడినో కనటానికింత ప్రయాసా. డబ్బు ఖర్చు అనవసరం. ప్రాప్తం వుంటే అందరికీ పుట్టినట్టే మాకూ పుట్టేవారు" అనేసారు తేలిగ్గా.

వాళ్ళంత తేలిగ్గా వదిలెయ్యలేకపోయారు జానకీ, ఆమె తల్లీను. ఫలితమే ఈ దత్తత.

ఈ ప్రతిపాదనకి అటు త్రిమూర్తిగానీ, ఇటు జానకి భర్త రాజారావు గానీ మొదట్లో వొప్పుకోలేదు. "ఎందుకులేమ్మా ఈ ఝుంఝాటాలన్నీ? ఎవరి బతుకు వాళ్ళు బతుకుతున్నాం

ప్రశాంతంగా. ఎక్కడి వాళ్ళం అక్కడుండక ఈ బదిలీలెందుకు? దత్తత తీసుకున్నంత మాత్రాన నానీ మా కొడుకైపోతాడా? జానక్కి ఏమీ కాకుండా పోతాడా? పసిపిల్లాణ్ణి బాధించడం దేనికి?" అని తోసిపుచ్చాడు త్రిమూర్తి.

"ఇంతిల్లు కట్టావు. సందడేది? నట్టింట పిల్లాడు తిరుగుతుంటే ఆదారి వేరు. తోడబుట్టిన వాడివని జానకి యిస్తానంటోందిగానీ దాని కొడుకు దానికి బరువయ్యా?" అంది తల్లి రత్నమ్మ.

ఆవిడకి కొడుకుతో కోడల్తో ఎప్పుడూ పడదు. ఒక్కర్తీ పల్లెటూళ్ళో వుండి వండుకు తింటోంది. అలాంటిది ఈ కొత్త చుట్టరికాలేంటో? నిగూఢంగా నవ్వేడు త్రిమూర్తి. అతనికి తెలుసు, తల్లిగానీ, చెల్లెలుగానీ దేనికి ప్రలోభ పడ్తున్నారో. ఐతే తమ మధ్యని నానీ నలిగిపోతాడేమోనని భయం. కాదనటానికి అంతకన్నా ఏమీ లేదు.

త్రిమూర్తి భార్య సునంద మాత్రం నానీ అనేసరికి కొంచెం సందేహించింది. ఈ పెంపకం పేరుతో అత్తా ఆడబడుచుల జోక్యం తన సంసారంలో ఎక్కువౌతుందేమోనని.

"పిల్లవాణ్ణి దూరంగా హాస్టల్లో వుంచి చదివిస్తానంటేనే నేను ఒప్పుకునేది. కన్నతల్లినని జానకి మమకారం చంపుకోలేక చీటికీ మాటికీ వచ్చి వాడిని డిస్టర్బ్ చేస్తే వాడు ఎటూ కాకుండా పోతాడు" అని ముందే హెచ్చరించింది భర్తని.

"మనకెంత వుంటే అంతలోనే పిల్లల్ని పెంచుకుందాం. మనకున్నది నలుగురు. వాళ్ళని పెంచలేమా?" రాజారావు భార్యని సున్నితంగా వారించబోయాడు. తన గుండెలమీద కూర్చుని ఆడి, తన చేతిమీద తలాన్చుకుని నిద్రపోయే కొడుకుని, పాలబుగ్గల పసివాడిని దూరం చేసుకోవాలంటే ఎలాగో అనిపించిందతనికి. అలాగని బావమరిది ఆస్తి అతన్ని ప్రలోభ పెట్టలేదనుకోవడానికి లేదు. మనసు అట్టడుగు పొరల్లో ప్రలోభం, దాన్ని కప్పేస్తూ ఈ మమకారపు పొర.

"ఇందులో పైవాళ్ళెవరు? మా అన్నయ్యేగా? తనకీ వదినకీ నానీ అంటే ప్రాణం. మనం కాదనుకున్నామనుకోండి ఇంకెవరో వచ్చి ఆస్తి ఎగరేసుకుపోతారు. మేనమామ ఆస్తి తినడానికి నానీకి హక్కు లేదా? అర్హత లేదా? వాడు బాగుపడ్తే వాడితోపాటు మనమూ బాగుపడతాంగా?" నచ్చజెప్పింది జానకి.

అన్నగారు ఎప్పుడో పండక్కీ, శుభకార్యానికీ యింత పసుపు కుంకాలూ, చీరా జాకెట్టు తప్పించి ఎక్కువగా ఏమీ పెట్టడు. అతనికి పట్టిన అదృష్టాన్ని తోడబుట్టినదే అయినా చెల్లెలితో ఎప్పుడూ పంచుకోలేదు. ఎంతెంత దూరం అని ప్రశ్నిస్తున్నట్టే వుంటాడు. అది చూసి జానకిలో అంతర్గతంగా ఒక పంతం. తనకొడుకుని అన్నగారికివ్వటం ద్వారా ఆయన సిరిని తనూ అందుకోవాలని.

తమ అన్నాచెల్లెళ్ళ మధ్య అనుబంధం యిలా వుండగా నానీ పెద్దయి జానక్కి గానీ, మిగిలిన వాళ్ళకి గానీ ఎంత చేస్తాడనేది మిలియన్ డాలర్ల క్వశ్చన్. అది జానక్కి తోచక పోవటం ఆమె దురదృష్టం.

★★★

నానీ దత్తత శాస్త్రోక్తంగా జరిగిపోయింది. దత్తత సమయంలో వాడిపేరు మీద కొంత ఆస్తి ఇస్తే బాగుంటుందని సూచించింది రత్నమ్మ. త్రిమూర్తి ఇంటిని నానిపేర్న రాసాడు. జానకి కళ్లు తళుక్కుమన్నాయి. తను తీసుకున్న నిర్ణయం సరైనదేననిపించింది గర్వంగా భర్తకేసి

చూసింది. రాజారావు కూడా సంతోషించాడు. ఐతే దాన్నతను వ్యక్తపరచలేదు.

నానీ పేరు తేజస్విగా మార్చి తన హక్కుని ప్రకటించుకుంది సునంద.

"మొదటున్నంచీ వున్న పేరు యిప్పుడు మార్చటమేమిటి?" రత్నమ్మ ఆక్షేపించింది గానీ ఎవరూ పట్టించుకోలేదు.

దేవుడు ప్రపంచాన్ని రెండుగా సృష్టిస్తాడు. పిల్లల కోసం ఒకటి, పెద్దవాళ్ళ కోసం ఒకటి. డబ్బూ, ఆస్తి అంతస్థులూ వాటి కోసం జరిగే కుట్రలూ, కుతంత్రాలూ ఇవన్నీ పెద్దవాళ్ళు తమలోకంలో తమకోసం తాము సృష్టించుకున్నవి. నానీ ప్రపంచంలో అమ్మా, నాన్నా, పండూ, బుజ్జీ, చిట్టీ-వాళ్ళతో చిలిపి కయ్యాలూ, కాలు విరిగిన గుర్రం బొమ్మా, ఎర్రటి మెరుపు కాగితం లాంటివన్నీ వున్నాయి. ఇప్పుడు వాడికి ఆ ప్రపంచంతో సంబంధం తెగిపోయింది. పెద్దవాళ్ళ ప్రపంచంలోకి బలవంతంగా నెట్టబడ్డాడు.

వాడికి గతం వాస్తవం. వర్తమానం వూహాధారితం. ఆ వూహాధారితమైన వర్తమానమే భవిష్యత్తుకి సోపానం. జానకి శరీరంలోంచి ఒక వాస్తవంలా వూడిపడ్డ నానీ సునంద సృష్టించిన తేజస్వి అనే భావ శరీరంలోకి పరకాయప్రవేశం చేస్తున్నాడు.

తను నానీ... జానక్కి కొడుకు

తను తేజస్వి... సునందకీ.. కొడుకే. కానీ కాదు.

ఈ రెండు వైరుధ్యాల మధ్య వాడు దేన్నో కోల్పోతున్నాడు. ఫలితంగా వాస్తవాలతో ఒక డిటాచ్‌మెంట్.

★★★

త్రిమూర్తి నానీని ఢిల్లీలో రెసిడెన్షియల్ స్కూల్లో వేసి తనూ అక్కడికి ట్రాన్సఫర్‌కి అప్లై చేసాడు.

జానకి ఏడ్చింది. "అంత దూరమా అన్నయ్యా? వాడు నీ దగ్గరుంటే మధ్యలో ఎప్పుడైనా వచ్చి చూసి వెళ్ళేదాన్ని. అంతదూరం ఇంతమందిమీ ఏం రాగలం? వాడినెప్పుడూ వదిలిపెట్టి వుండలేదేమో మీ బావ బెంగపెట్టుకున్నారు" అంది. రెండిళ్ళ మధ్యనీ వారధిలా వాడుంటాడనుకుంటే దూరమై పోతున్నాడేమోనని తల్లడిల్లిపోయింది.

"వాడు పెద్ద చదువులు చదివి, మంచి జాబ్‌చేసి పైకి రావాలనే కదా జానకీ వాడిని మాకు పెంపిచ్చినది? మరి అలాంటప్పుడు మంచి స్కూల్లో వెయ్యకపోతే ఎలా? ఢిల్లీ ఎంత దూరమని? రోజు ప్రయాణం." ముందరికాళ్ళకి బంధం వేసింది సునంద.

జానకి మరేమీ మాట్లాడలేకపోయింది. నిజమే! డబ్బుకి ఆశించి పెంపకం యిచ్చామని ఎలా చెప్పగలదు? సునందకి నానీని తమకి దూరంగా పెంచాలనుందనీ అర్థమౌతోంది. అది కూడా పైకి చెప్పుకోదగ్గ విషయం కాదు. అంతా లోపల్లోపల వుడకాల్చిన స్వయం పాకం.

ఎవర్లోనూ తప్పులేదు. రెండో వాళ్ళలోగల పొసెసివ్‌నెస్ అవాంఛనీయమైనదిగా అనిపిస్తోంది.

సునంద!

పదిహేనేళ్ళ క్రితం త్రిమూర్తి జీవితంలో నవవధువుగా అడుగు పెట్టినప్పుడు ఆమె కళ్ళలో కోటి కలలుండేవి. ఆశల దీపాలు వెలుగుతుండేవి. ఆ వెలుతుర్లో తన గమ్యం ప్రతి ఆడపిల్లకీ మల్లే నిర్దుష్టంగా కనిపించేది. భర్త, పిల్లలు, వాళ్ళ ప్రగతి. కాలం గడుస్తున్న కొద్దీ ఆ దీపాలు

మలిగిపోయి చీకటి మిగిలింది. భవిష్యత్తు అగమ్యగోచరంగా తయారైంది. సాధించాల్సిందంటూ ఏమీ లేకపోవడం ఒక వెల్తిలా ఆమె జీవితాన్ని ఆక్రమించుకుంది. అలాంటి నిర్లప్తత నానీ రాకతో సూర్యోదయంతో కలిగిపోయే మంచులాగైంది. కొత్తఆశలు చిగురించసాగాయి. ఇదంతా కూడా పెద్దవాళ్ళ ప్రపంచంలోని భాగమే. నానీకి దాంతో ఎలాంటి కమిట్‌మెంటూ లేదు.

★★★

"నానీని అమెరికా పంపిస్తున్నాడుట అన్నయ్య" అంది జానకి భర్తతో.

"నువ్వు కోరుకున్నదదే కదా!" అన్నాడు రాజారావు.

"ఏమిటి? ఇలానా? వాడికసలు నేనెవరో కూడా తెలియనట్టైపోయింది. మన రెండిళ్ళ మధ్యన వుంటానుకున్నాను. కానీ నాకే దూరమవుతాడనుకోలేదు" అంది జానకి. అంటుంటే కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

నిజమే! సునంద నానీమీద విజయాన్ని సాధించింది. విలాసవంతమైన జీవితం, అందులోనే క్రమశిక్షణ. అనుక్షణం వాడి చుట్టూ పరిభ్రమిస్తూ యిద్దరికీ మధ్యన అవినాభావ సంబంధాన్ని సృష్టించుకుంది. అప్పుడప్పుడూ వచ్చే క్లుప్తమైన వుత్తరాలు తప్ప నానీతో జానక్కి మరే అనుబంధంలేదు. ఆ వుత్తరాలైనా అన్నో వదినో రాస్తారు తప్ప నానీ కాదు.

"కనీసం యిప్పుడేనా ఒకసారి పంపించమని రాస్తాను" అందిజానకి. ఆమె మనసులో ఎన్నో వూహలున్నాయి. కొడుకుమీద ఆశలున్నాయి. పెద్ద కూతురి పెళ్ళిచేసి అప్పటికే ఆర్థికంగా బాగా చితికిపోయారు. రాజారావుకైతే ముసలిరూపం వచ్చేసింది. ఇంకా పైకి రావాల్సిన పిల్లలు యిద్దరున్నారు. వాళ్ళ బాధ్యతలో నానీ కొంచెమేనా వూతం యిస్తే బావుంటుందని కోరిక.

జానకి కూతురి పెళ్ళికి అన్నగారు కొంత సాయం చేస్తాడనుకుంది. అతనలాంటిదేం చెయ్యలేదు. మేనమామగాతన బాధ్యతెంతో అంతవరకే నిర్వర్తించాడు. అక్కడ లక్షలాస్తి మూలుగుతోంది. తన అన్నకంటే చెల్లెలి పిల్లలపట్ల ప్రేమ లేకపోయింది. నానీకి వాళ్ళేం పరాయివాళ్ళు కారుగా. ఒక్కసారి వాడిని కూర్చోబెట్టి అంతా వివరించి చెప్పాలి. ఇక్కడంటే అంతా వదినగారి అదుపాజ్ఞలు. అమెరికా వెళ్ళాక అవేంవుండవు. అందుకే కొడుకుని తనదగ్గిరికి పిలిపించుకుని అన్నీ విడమర్చి చెప్పాలనుకుంది.

★★★

నానీని వాళ్ళూరు పంపించడానికి సునంద మొదట్లో వప్పుకోలేదు. "వాడెలాగా స్టేట్స్ వెళ్ళిపోతున్నాడు. ఒక్కసారి వెళ్ళొస్తే తప్పేముంది?" అని ఎంతో నచ్చజెప్పిన మీదట అతికష్టంమీద సరేనంది. కూడా తానూ వెళ్తానంది.

"వాడు హర్టైతే?" మృదువుగా మందలించాడు త్రిమూర్తి.

నానీకి సుముఖతగానీ, విముఖతగానీ లేవు. కొద్దిగా వుద్విగ్నత... అంతే!

తను ఆరేళ్ళ పాటు పుట్టిపెరిగిన యిల్లు. తనతో ఆడిపాడిన తోబుట్టువులు, కన్న తల్లీ, తండ్రీ. కుతూహలంగా చూసాడు వాళ్ళని. బంధువులెవర్నో చూస్తున్నట్టే అనిపించింది.

నవనవలాడే గులాబీలా వుండే సునందకీ, వడిలిన తోటకూర కాడలాంటి జానక్కీ, కాంట్రాస్ట్. దాదాపు సమీప వయస్సులైనా త్రిమూర్తి ఎలా వున్నాడు? రాజా వెలాగైపోయాడు? రెక్కలున్న పువ్వుల్లా తుళ్ళిపడే తన క్లాస్‌మేట్స్. బతుకు బరువుని యిప్పట్నుంచే కొద్దికొద్దిగా మోస్తున్న చెల్లీ, తమ్ముడూ....

పెంపకం వెళ్లకపోతే తనూ ఈ పరంపరలో భాగమే. మరిప్పుడు? అతన్లో అదే డిటాచిమెంటు!

"అక్క పెళ్ళికి బోల్డు అప్పులు చేసాం. బుజ్జికి అప్పుడే పెళ్ళీడొచ్చింది. పండు యింటరైపోయింది. ఇంజనీరింగ్ చదువుతానంటున్నాడు. మామయ్య అక్కపెళ్ళికి నయా పైసాకూడాసాయం చెయ్యలేదు" శ్వాస తీసుకోవడానికని ఆగింది జానకి. ఆ కాస్త వ్యవధిలోనూ ఆమెను చాలా చదివేడు నాని. ఆమె చెప్పిన మాటల్లోకన్నా ఎక్కువగా ఆ పిసరంత మౌనంలోనే ఆమెకేం కావాలో అర్థమైంది.

అతనిలో అసహనం. మరేదో అయిష్టతా మొదలైంది. తనిక్కడికి చెందడు. వీళ్ళే తనని వద్దనుకున్నారు. కారణం ఏదేనా కానీ. వాళ్ళు కావాలనుకున్నా తను వాళ్ళ మనిషి కాలేడు. దానికి నిర్దుష్టమైన కారణం వుంది. తన వేర్లు ఇక్కడున్నాయి. భూమి నుంచీ ఆకాశంలోకి ఎదిగిన మొక్క తను. ఆకాశంలో ఏదో వుంటే దాన్ని స్వీకరించి వేర్లకి అందించలేడు. తనుగా పుష్పించి ఫలించాలి. అతనికి కర్తవ్యం అర్థమైంది.

".... నాన్నని చూస్తున్నావుగా, ఎలా తయ్యారయ్యారో! నువ్వెక్కడ మా దగ్గిర కొస్తే వాళ్ళ ఆస్తిమాకు పెట్టేస్తావోనని కట్టడి చేస్తోంది వదిన. ఆ ఆస్తంతా ఎవరిది? నా అన్నది. వాళ్ళకి పిల్లల్లేనప్పుడు ఏం ఆశిస్తే తప్పా?..." జానకి ప్రశ్నకి జవాబు చెప్పలేదు నాని. నిశితంగా ఆమెని చూస్తూ వుండిపోయాడు.

నిజమే! డబ్బు పునాదిమీద కృత్రిమంగా కట్టిన బంధాల్లో బలం వుండదు. తన పెంపుడు తల్లికి అదే అనుమానం. తనెక్కడ వీళ్ళవైపు మొగ్గిపోతాడోనని.

★★★

సునంద నిర్దేశించినట్టు రెండే రోజులున్నాడు నానీ అక్కడ. అతనేం జవాబు చెప్తాడోనని వాళ్ళంతా చెవులు చేసుకుని అతని ప్రతి కదలికనీ నిశితంగా గమనిస్తున్నారు ఇంట్లో వాళ్ళు. నానీ తిరిగి వెళ్లే తరుణం వచ్చింది.

ఏం చెప్తాడో! జానకిలో అందరికన్నా ఎక్కువ వుద్విగ్నత. పది లక్షలు చేసే యిల్లు బావమరిది నానీ పేరు మీద రాసినప్పుడు కలిగిన సంతోషంకన్నా నానీ యిచ్చే మాటొక్కటి ఎక్కువ ఆనందానిచ్చేలా వుంది రాజారావుకి.

"ప్రతి మనిషికీ తనకున్నదాంట్లో దాచి పిల్లలకివ్వాలని వుంటుంది. తమకున్నదాన్ని పరాయిపిల్లలకి యివ్వాలనుకోరు. అత్తయ్య, మామయ్యదీనికి మినహాయింపు కారు. కాకపోతే నేను వాళ్ళ స్వంత కొడుకుని కాకపోవటం చేత అందులో మీకు అనౌచిత్యం కనిపిస్తోందేమో! నా వరకూ నాకది సమంజసంగానే వుంది. ఇకపోతే మీ పట్ల నా బాధ్యత... ఎమ్మెస్ పూర్తవడానికి నాకింకో రెండు మూడేళ్ళు పడుతుంది. ఆ తర్వాత సంపాదనపరుడినౌతాను. అంటే స్వతంత్రుణ్ణౌతాను. అప్పుడు మీకోసం ఏదేనా చెయ్యగలుగుతాను". నెమ్మదిగా, స్పష్టంగా తన వుద్దేశాన్ని చెప్పాడు. అలా చెప్తుంటే తను రెండుగా విడిపోయిన భావన. ఒక సగం అటు లాగుతుంటే మరో సగం యిటు. నరకమంటే యింకేదీ వుండదనిపించింది.

రాజారావూ, జానకీ మొహాలు చూసుకున్నారు. ఇద్దరి కళ్లల్లోంచి అనేక భావాలు. ఆఖరికి ఒక ప్రశ్నార్థకం మిగిలింది.

"ఇదేనా ఈ దత్తత నుంచీ తాము ఆశించినది?"

ఈ ప్రశ్నతో నానికి నిమిత్తం లేదు. ఎందుకంటే తామేం ఆశించారో అతనికెప్పుడూ వాళ్ళు స్పష్టంగా చెప్పలేదు. మామయ్య దగ్గిరైతే నువ్వు సుఖపడ్తావని చెప్పారు. అతనదే చేస్తున్నాడు. నోరు తెరిచి అడినందుకు కన్నవాళ్ళపట్ల కొంత వుదారతని ప్రకటించాడు.

తన జీవితంలో పెనుమార్పొస్తుందనుకుంది జానకి - నానీని దత్తతిచ్చినప్పుడూ, యిప్పుడూ కూడా. ఏ మార్పూ లేకుండానే రెండోసారి కూడా నానీ వెళ్ళిపోయాడు.